

రాణించిన బ్యాట్స్‌మన్

అంతర్ జిల్లాల మల్టీ డేస్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో కృష్ణా, చిత్తూరు జట్లు తలపడ్డాయి. -8లో



ఎర్రచందనం స్మగ్లర్ అరెస్టు

బద్వేలు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 23న నమోదైన ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ప్రధాన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.380	రూ.420
రెండోరకం	రూ.300	రూ.376



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1087 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	240	456
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1949.360 కిలోలు

న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించి, వాటి పరిష్కారంలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారంపై సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి, గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లా కేంద్రానికి చేరిన గాలికుంటు టీకా

రాయచోటి టౌన్: పశువులకు వైరస్‌ద్వారా వ్యాపించే గాలికుంటు వ్యాధి నివారణకు సంబంధించిన టీకాలు జిల్లాలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయానికి చేరాయని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై తెలిపారు. జిల్లా కేంద్రానికి మొత్తం 78 బాక్స్‌లు వచ్చాయని, ఒక్కో బాక్స్‌లో 80 సీసాలు ఉంటాయి. ఒక్కోసీసాలో 100ఎంఎల్ లిక్విడ్ ఉంటుందన్నారు. ఈ మందును 3,45,500 పశువులకు ముందస్తుగా వేస్తామని చెప్పారు. త్వరలోనే ఆయా నియోజక వర్గాలకు టీకా పంపిణీ చేస్తామని తెలిపారు.

గంగమ్మా..కాపాడవమ్మా..



వర్షాలు కురిపించాలని గంగమ్మకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు

లక్కిరెడ్డిపల్లి: గంగమ్మతల్లీ వర్షాలు కురిపించి రైతులు, ప్రజలందరూ చల్లగా ఉండేలా కరుణించి కాపాడమ్మా అంటూ భక్తులు వేడుకున్నారు.ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించారు. తలనీలాలు అర్పించారు.ఆలయం భక్తులతో నిండిపోయింది. ఆలయ చైర్మన్ రెడ్డయ్య, ప్రత్యేకాధికారి మారుతిప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కీచక ఉపాధ్యాయుడి సస్పెన్షన్



ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని చౌటపల్లి గ్రామం వద్ద రవీంద్రనగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లును సస్పెండ్ చేసినట్లు ఎంఈవో చక్రేనాయక్ తెలిపారు. విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంపై ఆదివారం సాక్షిలో వచ్చిన కథనానికి స్పందించి అన్నమయ్య జిల్లా డీఈఓ శివప్రకాష్ రెడ్డి ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు ఎంఈవో తెలిపారు. వెంకటేశ్వర్లుపై పోక్సో చట్టం క్రింద లక్కిరెడ్డిపల్లె స్టేషన్‌లో కేసు నమోదుచేసినట్లు లక్కిరెడ్డిపల్లె ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు.

పెద్దదర్గాలో సినీ నటుల ప్రార్థనలు



పెద్దదర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న సినీ హీరో శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

కడప కల్చరల్: దేశంలో ప్రముఖ సూఫీ ఆధ్యాత్మికంగా విరాజిల్లుతున్న కడప అమీన్ పీర్ (పెద్ద) దర్గాను లారీ చాప్టర్-1 సినీ యూనిట్ బృందం ఆదివారం దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలునిర్వహించింది. సినీ హీరో శ్రీకాంత్‌రెడ్డి, హీరోయిన్ చంద్ర శిఖాతోపాటు సినీ యూనిట్ ప్రతినిధులకు దర్గా ముజావర్ సంప్రదాయ స్వాగతం పలికారు. తొలుత వారు దర్గాలోని హజరత్ పీరుల్లా మాలిక్ మజార్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆ ప్రాంగణంలోని ఇతర గురువుల మజార్లను దర్శించి ఫాతెహా చేశారు. వారికి ముజావర్ దర్గా గురువుల విశిష్టత, ప్రత్యేకతను తెలియజేశారు. ఈ సందర్భంగా సినీ బృందం మాట్లాడుతూ ఆగస్టు 2వ తేదీన లారీ చాప్టర్-1 చిత్రం విడుదల కానుందని, దర్గా గురువుల ఆశీస్సులు కోసం రావడం జరిగిందన్నారు.

లారీ చాప్టర్-1 చిత్రాన్ని ఆదరించాలి

కడప రూరల్: బ్రహ్మంగారిమఠం మండలం అమగంపల్లె గ్రామానికి చెందిన తాను లారీ చాప్టర్-1 సినిమాతో సినీ రంగానికి పరిచయం అవుతున్నానని, తనను ప్రతి ఒక్కరూ ఆదరించి ఆశీర్వదించాలని ఆ సినిమా కథ కథానాయకుడు శ్రీకాంత్‌రెడ్డి కోరారు.ఆదివారం కడపలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఈ సినిమా తెలుగుతోపాటు తెలుగు,తమిళం, కన్నడ, హిందీ, బెంగాలి బాషల్లో ఆగస్టు 2వ తేదీన విడుదల చేయనున్నట్లు చెప్పారు.

చరిత్ర ఆనవాళ్లు మాయం

- బ్రిటీష కాలం నాటి స్టీమ్‌లోకోఇంజిన్ షెడ్ పూర్తిగా తొలగింపు
- రైల్వేపరిశ్రమపై నందలూరువాసుల్లో అడుగంటిన ఆశలు



ఈ చిత్రంలో కనిపిస్తోంది 144 సంవత్సరాల చరిత్ర కలిగిన స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్‌ను నేడు పూర్తిగా తొలిగించేసిన ప్రదేశం. 20 రైలింజన్లు, వందలాది కార్మికులతో రాత్రి,పగలు తేడా లేకుండా కళకళలాడిన ప్రాంతం ఇలా తయారైంది. రైల్వే అధికారులు ఇప్పుడు అక్కడ లోకోషెడ్ ఉందన్న ఆనవాళ్లు లేకుండా చేశారు.



ఈ చిత్రంలో మొండిగోడలతో కనిపిస్తోంది చెయ్యేరు నదిపై బ్రిటీషు రైల్వే పాలకులు నిర్మితం చేసిన రైల్వేవంతెన. 150 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన ఈ వంతెనను అప్పట్లో బ్రిటీషు రాణి ప్రారంభించినట్లు పూర్వీకులు చెపుతున్నారు. కనీసం చరిత్రకు సాక్ష్యం కనిపించకుండా చేశారనే విమర్శలను రైల్వే మూటకట్టుకుంది.



నందలూరు రైల్వేకేంద్రంలో స్టీమ్ ఇంజన్‌లోకోషెడ్‌లోని రైలింజన్



బ్రిటిషు పాలకులు నిర్మితం చేసిన స్టీమ్‌ఇంజన్‌లోకోషెడ్ (ఫైల్)

రాజంపేట: ఉభయ వైఎస్సార్‌జిల్లాలో రైల్వేపరంగా ప్రసిద్ధి చెందిన నందలూరు రైల్వేకేంద్రం చరిత్ర ఆనవాళ్లను రైల్వే అధికారులు నేటితో పూర్తిస్థాయిలో గల్లంతు చేశారు. 1880 ప్రాంతంలో బ్రిటీషు రైల్వేపాలకులు స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్‌ను ఏర్పాటు చేశారు. 150 ఎకరాల విస్తీర్ణం, 250 రైల్వేక్వార్టర్స్, హెల్త్, ఐవోడబ్ల్యూ, పీడబ్ల్యూఐ, హెల్త్, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, టీఎక్స్‌ఆర్ విభాగాలు ఉండేవి. దాదాపు 1000 మంది కార్మికులు ఉండేవారు. ఇక్కడి నుంచే చెన్నై, గుంతకల్ వరకు రైలింజన్లతో ప్యాసింజరు, గూడ్స్‌రైళ్లను నడిపించేవారు.నందలూరు రైల్వేకేంద్రం వందలాది క్వార్టర్స్, నివాసగృహాలు, వివిధ విభాగాల కార్యాలయాలతో కళకళలాడేది.

యూపీఏ పాలనలో నిర్వీర్యం

రెండు దశాబ్దాల కిందట అంటే యూపీఏ పాలనలో నందలూరు రైల్వేకేంద్రానికి ఇండియన్ రైల్వేలో గుర్తింపు తెచ్చే స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్‌ను ఎత్తేశారు. దాదాపు 20 రైలింజన్లను స్క్రాప్ కింద ముక్కలు చేసి రైల్వేశాఖ అమ్మేసింది. కాలానుగుణంగా సాంకేతిక మార్పులు రావడం, డీజిల్, కరెంటు రైలింజన్లు రావడంతో అప్పటి పాలకులు చూస్తూ ఉండిపోయారే తప్ప స్టీమ్ లోకోషెడ్ స్థానంలో ప్రత్యామ్నాయ పరిశ్రమ ఏర్పాటు గురించి అడిగిన పాపాన పోలేదు. ఆనాటి నుంచి నందలూరు రైల్వేకేంద్రాన్ని దశలవారీగా గుంతకల్ రైల్వే డివిజన్ ఉన్నతాధికారులు నిర్వీర్యం చేస్తూ వచ్చారు నందలూరు స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్ రైల్వేపరంగా నందలూరుకు ఉన్న ప్రాముఖ్యతను తెలియజేసేందుకు స్థానికనేతరులకు ఉపయోగపడింది. రైల్వే యాజమాన్యం ప్రస్తుతం ఇది కూడా లేకుండా చేసింది. వందేళ్ల కిందటి స్టీమ్‌లోకో షెడ్ బ్రిటీషు రైల్వేపాలకుల చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచింది. ఇప్పుడు ఈ షెడ్‌ను వేలంపాట పెట్టి తొలగించేసింది. ఈ షెడ్ ఉంటే నందలూరు రైల్వేపరిశ్రమ ఏర్పాటు ప్రస్తావన కొనసాగుతూనే ఉంటుదనే భావనతో రైల్వేశాఖ తొలగించేసినట్లు ఉందని ఉద్యమకారులు పెదవి విరుస్తున్నారు.

- 2006 ఫిబ్రవరి 14 నుంచి నందలూరుకు పూర్వవైభవం తీసుకురావాలని పదేళ్ల కిందట అన్ని రాజకీయపార్టీలకు చెందిన నాయకులతో రైల్వేఐక్యపోరాటసమితి ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. 70రోజుల పాటు రిలేదీక్షలు, వినూత్ననిరసనలు, రాస్తారోకోలు, ఆందోళనలు చేశారు. చివరికి యూపీఏ ప్రభుత్వ హయాంలో రైల్వేమంత్రి లాలు ప్రసాద్ వద్దకు వెళ్లారు. ఆయన లోక్‌సభలో వ్యాగిన్ రిపేరు వర్క్‌షాపు లేదా ప్రత్యామ్నాయ రైల్వేపరిశ్రమ పెడతామని ప్రకటించిన సంగతి విధితమే.

కళ్లెదుటే లోకోషెడ్ చరిత్ర తుడిచిపెట్టేశారు



రైల్వే అంటే నందలూరు అనేందుకు నిదర్శనంగా ఉన్న బ్రిటీషు కాలంనాటి ఆనవాళ్లు లేకుండా చేశారు. ఇక్కడ స్టీమ్‌లోకో ఇంజిన్‌షెడ్ ఉందని చెప్పడానికి కూడా లేకుండా చేశారు. ఏ పాలకలున్నా..నందలూరు రైల్వేకు ఒరిగిందేమిలేదు. ఇప్పటి వరకు నందలూరు రైల్వే పూర్వవైభవంగా రావడం కలగానే మిగిలిపోయింది.

–ఫైజుల్లాఖాన్‌లోడి, లోకాఅదాలత్‌సభ్యుడు, నందలూరు

పాలకుల హామీలు నీటిమూటలే



బ్రిటీషు రైల్వే పాలకులు నందలూరుకు ఇచ్చిన ప్రాముఖ్యత నేటి పాలకలు ఇవ్వడంలేదు. అన్ని రాజకీయ పక్షాల వారు చూసి వెళతారు. అదిగో రైల్వేపరిశ్రమ వచ్చేస్తోందని చెబుతుంటారు. ఇప్పుడు గుర్తుగా ఉన్న లోకోషెడ్‌ను తొలగించడంతో రైల్వేపరిశ్రమ ఆశ అడుగంటినట్లేననే భావన కలుగుతోంది. పాలకులు హామీలు నీటిమూటలే అని తేలిపోయింది.

–మహేష్, రైల్వే ఉద్యమనేత, నందలూరు

హామీలే.. ఏమీలే..

నందలూరు రైల్వేకేంద్రం చరిత్రను పూర్తిగా క్లోజ్ చేశారు. దేశ, రాష్ట్రస్థాయిలో ఉన్న రాజకీయ దిగ్గజాలు నందలూరును సందర్శించి తమ ప్రభుత్వాలు అధికారంలోకి వస్తే తప్పకుండా రైల్వే పరిశ్రమను తీసుకొస్తామని హామీలు గుప్పించారు.అయితే సర్వే, స్థల నివేదికలు బుట్టదాఖలయ్యాయి. ఇప్పుడు తాజాగా చరిత్రను గొప్పగా చూపించేందుకు ఆధారంగా నిలిచిన లోకోషెడ్‌ను, తెల్లదొరల పాలనకు మార్క్‌గా నిలిచిన ఫోర్‌మెన్ బంగళా, చెయ్యేరు రైల్వే వంతెనను స్క్రాప్ కింద తొలగించేశారు.

దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో.....

నందలూరు రైల్వేకేంద్రానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు దివంగత సీఎం వైఎస్‌రాజశేఖరరెడ్డి పాలనలో అప్పటి ప్రభుత్వం ముందుకొచ్చింది. రైల్వేపరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం తరపున ఎటువంటి సహకారమైనా అందిస్తామని అప్పటి రైల్వే మంత్రిత్వశాఖకు నేరుగా ఆయన లేఖ రాశారు. తండ్రి బాటలోనే వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఎంపీగా ఉన్నప్పుడు నందలూరులో రైల్వేపరిశ్రమ గురించి రైల్వేమంత్రిత్వశాఖను కోరారు. చంద్రబాబు సీఎం అయిన తర్వాత నందలూరు రైల్వేకేంద్రంలో రైల్వే పరిశ్రమ ఏర్పాటుపై నోరుమెదపలేదు. కేంద్రానికి విన్నవించనూలేదు.

- నందలూరుకు పూర్వవైభవం తీసుకురావాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కృషి చేస్తూనే ఉన్నారు. తొలిసారిగా లోక్‌సభలో నందలూరు రైల్వేచరిత్రను, అక్కడే రైల్వేపరిశ్రమను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను, అందుబాటులో ఉన్న సౌకర్యాలను వివరించారు. అనేక మార్లు రైల్వేమంత్రులను కలిసి వినతులు సమర్పించారు. నందలూరు రైల్వేకేంద్రంలో రైల్వేపరిశ్రమను ఏర్పాటుచేయాలని, 250 క్వార్టర్స్ ఉన్నాయని, 150 ఎకరాల స్థలం ఉందని అనేకమార్లు వినియోగంలోకి తీసుకురావాలని రైల్వేమంత్రిత్వశాఖను కోరారు. క్యారేజి రిపేర్‌షాపు, ఎలక్ట్రికల్ ఇంజిన్ రిపేర్‌షెడ్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఇందుకు ఈ అంశం రైల్వేబోర్డు పరిధిలో ఉందని, రైల్వేబోర్డు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు అప్పట్లో ఎంపీకి రైల్వే సమాధానం ఇచ్చింది.

మీ భూమి.. ఇక బాబుదే!

ఇక పేదల భూములన్నీ చంద్రబాబువే.. అధికారం వచ్చీ రాగానే కూటమి ప్రభుత్వం పంజా విసిరింది. ప్రజల భూములు లాక్కోవడానికి పక్కా స్కెచ్ వేసింది. ముందుగా ప్రజల భూముల రికార్డులన్నీ ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా మార్పు చేస్తుంది. ఆ తరువాత ప్రభుత్వ భూమిని పేదలే కబ్జా చేశారని ముద్ర వేస్తుంది. అది ఎన్ని రిజిస్ట్రేషన్లు జరిగినా, ఎన్ని పత్రాలు ఆధారాలున్నా, ఆ రికార్డులు తారుమారు చేసేందుకు సిద్ధమైంది.

- 982.48 ఎకరాలపై టీడీపీ పంజా
- బ్రిటీష్‌కాలం నాటి రికార్డులు తారుమారు
- నాడే రిజిస్ట్రేషన్‌లు జరిగినట్లు ఆధారాలు
- భూములన్నీ అనాధీనం కింద మార్చేసిన కూటమి ప్రభుత్వం
- ఆ నిందలన్నీ మాజీ మంత్రి కుటుంబంపై వేస్తున్న వైనం
- ప్రభుత్వ నిర్వాకంతో విస్తుపోతున్న రెవెన్యూ యంత్రాంగం



పుంగనూరు మండలం రాగానిపల్లిలోని భూములు

చిత్తూరు కలెక్టరేట్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడవక ముందే రెవెన్యూ రికార్డులను మార్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో వెబ్‌ల్యాండ్ పేరుతో అనేక అక్రమాలు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే ఆ అక్రమాలను వెలికి తీసేందుకు రీ సర్వేకు శ్రీకారం చుట్టింది. అయితే పూర్తిగా చేస్తే చంద్రబాబు దోచుకున్న భూముల చిట్టా వెలుగులోకి వచ్చేస్తుందని భయపడ్డ చంద్రబాబు దాన్ని అడ్డుకోవడానికి నానాపాట్లు పడ్డారు. అందుకే ఇప్పుడు ఆ రీ సర్వేని కొనసాగించే సాహసం చేయలేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. పేదల భూములను దోచుకునేందుకే చంద్రబాబు వెబ్‌ల్యాండ్‌ను ప్రవేశపెట్టారని రెవెన్యూ అధికారులు వెల్లడిస్తున్నారు. ఆ వెబ్‌ల్యాండ్ మాంత్రికుడు చంద్రబాబు అధికారంలోకి రాగానే తన పాత అనుభవాలకు పని పెడుతున్నారు. వెబ్‌ల్యాండ్‌లో కిటుకులు తెలిసిన చంద్రబాబు తిరిగి అక్రమాలకు తెరలేపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పుంగనూరు మండలం రాగానిపల్లి భూములపై కన్నేశారు. రాగానిపల్లి గ్రామ దాఖలా సర్వే నెంబరు 22లో ఉన్న 982.48 ఎకరాల భూమి పూర్తిగా ప్రైవేటు భూమి అని, అది ప్రభుత్వ భూమి కాదని బ్రిటిష్, జమీందారి కాలం నాటి రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఎన్నో ఏళ్ల నాటి రెవెన్యూ రికార్డుల్లో ఆ 982.48 ఎకరాలు రైత్వారి భూమిగా ఉంది. కూటమి సర్కారు అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాగానిపల్లి భూములపై అసత్య ఆరోపణలు చేయడం మొదలుపెట్టారు. తమకు అనుకూలమైన పత్రికల్లో రైతుల భూములను ప్రభుత్వ భూములుగా చెప్పించి అసత్య కథనాలను ప్రచురిస్తున్నారు. వారి ధోరణి చూసి, చుట్టుపక్కల ఉన్న రైతులు బెంబేలెత్తిపోతున్నారు. మరోవైపు రెవెన్యూ అధికారులు ఈ రికార్డుల మార్పులతో తమకు సంబంధం లేదంటూ తప్పించుకుంటున్నారు.

రికార్డులు ఏం చెబుతున్నాయంటే..

రాగానిపల్లిలో గల భూములను తొలుత పుంగనూరు జమీందారు మహదేవరాయులు, శంకర్‌రాయులుకు జమీందారి పట్టా నెంబరు 20గా మంజూరు చేశారు. సదరు భూమిని 1907లో మహదేవరాయులు తల్లి సావిత్రమ్మకు భాగపరిష్కార పత్రం ద్వారా సంక్రమించింది. 1943లో ఆమె తన ఆస్తులను కుమారుడైన మహదేవరాయులుకు రిజిస్టర్డ్ వీలునామా ద్వారా కేటాయించారు. దీనిపై సర్వే సెటిల్‌మెంట్ అధికారులు ప్రీ ఎస్టేట్ అబాలిష్ రికార్డులను పరిశీలించి మహదేవరాయులు కుమారుడైన శంకర్‌రాయులుకు 27-02-1958న రఫ్ పట్టా మంజూరు చేశారు. ఈ సమయంలో ఉన్న ప్రైమాషి నెంబరు: 25, 26, 27, 28ని మార్పు చేస్తూ సర్వే నెంబరు 22గా, పట్టా నెంబరు 300 గా మంజూరుచేశారు. దీనిపై ఆనాటి సర్వే సెటిల్ మెంట్ అధికారులు గ్రామంలో పూర్తి విచారణ నిర్వహించారు. విచారణలో అభ్యంతరాలను ఇటు ప్రభుత్వం నుంచి అటు ప్రజల నుంచి లేకపోవడంతో ఎస్టేట్ అబాలిష్ యాక్ట్ 1948, సెక్షన్ 11ఎ కింద రైతు వారీ పట్టా మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. దీనిని బట్టి ఆ భూమి ప్రైవేటు భూమిగా రైత్వారి పట్టాగా నిర్ధారణ అయింది.

అన్నింటికీ పెద్దిరెడ్డి కుటుంబమే కారణమట

ఇటీవల మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి కొన్ని ఫైళ్లు కాలిపోయాయి. అయితే ఆ షార్ట్‌సర్క్యూట్ ఉద్దేశపూర్వకంగా రాగానిపల్లి భూములు కాపాడుకునేందుకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి చేయించారంటూ కథలు అల్లేశారు. ఆ కథలను టీడీపీ అనుకూల పత్రికల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. వాస్తవానికి రాగానిపల్లి భూముల రికార్డులు పలమనేరు రెవెన్యూ డివిజన్, చిత్తూరు కలెక్టరేట్‌లో ఉంటాయి. అధికారాన్ని వినియోగించి రాగానిపల్లి ప్రైవేట్ భూములను ప్రభుత్వ భూములంటూ వెబ్‌ల్యాండ్‌లో తారుమారు చేయించి, దాన్ని మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబంపై వేసేందుకు అధికార పార్టీ కుట్రలు చేస్తోందన దానికి ఇదే నిదర్శనం.

ఎన్ని సార్లు సర్వే చేసినా అదే పట్టా

రాగానిపల్లికి చెందిన 982.48 ఎకరాల భూమిపై మల్లుపల్లికి చెందిన వెంకటస్వామి, రెడ్డెప్పరెడ్డి కలసి శంకర్‌రాయులు ద్వారా రిజిస్టర్డ్ కొనుగోలు చేసుకున్నారు. 1964లో సదరు వ్యక్తుల కుమారులు అగస్తిరెడ్డి, మునెప్ప, చిన్నప్ప రెడ్డెప్పరెడ్డి, వెంకటరెడ్డి, వెంకటస్వామి మైనర్ గార్డియన్లుగా కొంత భూమిని, చెన్నకేశవరెడ్డి కుమారుడు ఎల్.మాధవరెడ్డికి విక్రయించారు. 1966లో మిగిలిన అర్ధ భాగాన్ని కూడా రెడ్డెప్పరెడ్డి మాధవరెడ్డికే విక్రయించారు. సదరు ఎల్. మాధవరెడ్డి ఈ భూములను పలువురికి విక్రయించారు. దీనిపై 1971లో అప్పటి చిత్తూరు కలెక్టర్ విచక్షణాధికారంతో సదరు భూములకు రైతు పట్టాను రద్దు చేయాలని నెల్లూరు సర్వే సెటిల్‌మెంట్ అధికారిని కోరారు. అయితే 1958లో మంజూరు చేసినందున ఆ పట్టా రద్దు చేసే అధికారం తనకు లేదని దీనిపై నెల్లూరు సర్వే సెటిల్‌మెంట్ అధికారి తేల్చిచెప్పేశారు. అవసరమైతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోవాలని లేఖ పంపారు. దీనిపై పలుమార్లు నెల్లూరు సర్వే సెటిల్‌మెంట్ అధికారి ఇది రైతు పట్టాగా నిర్ధారించి, కలెక్టర్‌కు ఉత్తర్వులు పంపారు.

పున:విచారణలోనూ ప్రైవేటు భూములుగానే..

హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ సెటిల్‌మెంట్ స్వీయ పరిశీలనలో కేసును 1973లో విచారణ చేపట్టారు. ఆ విచారణలో రెండు కారణాలను చూపుతూ 1977లో పట్టా రద్దు చేశారు. 1978లో సదరు ఉత్తర్వులపై రైతులు కమిషనర్ సర్వేసెటిల్ మెంట్ వారి ఎదుట రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. సదరు పిటిషన్‌ను కమిషనర్ ఆలస్యంగా దాఖలు చేశారని తిరస్కరించారు. దీనిపై రైతులు 1978లో హైకోర్టును ఆశ్రయించగా, 1980లో హైకోర్టు సర్వే సెటిల్‌మెంట్ అధికారుల ఉత్తర్వులను రద్దు చేస్తూ సదరు భూములపై రైతుల హక్కు, అనుభవం ఉన్నందున దీనిపై సర్వే సెటిల్ మెంట్ కమిషనర్ హైదరాబాద్ పునర్విచారణ చేయాలని ఆదేశించింది. 2006లో కమిషనర్ తన తీర్పులో 1977 డైరెక్టర్ ఆఫ్ సెటిల్‌మెంట్ ఇచ్చిన తీర్పు సరిలేదని, పట్టా ఇచ్చిన 20 సంవత్సరాలు తరువాత కేసును స్వీయ పరిశీలనకు తీసుకునే అధికారం లేదని తీర్పు వెలువరించారు. తిరిగి దీనిని పునఃపరిశీలన చేయమని డైరెక్టర్ ఆఫ్ సెటిల్‌మెంట్‌ను ఆదేశించారు. దీనిపై 2022లో సదరు డైరెక్టర్ ఆఫ్ సెటిల్‌మెంట్ వారు తీర్పును ప్రకటించి, 1958లో రైతులకు ఇచ్చిన పట్టా ప్రక్రియ పూర్తయ్యిందా లేదా తేల్చమని చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించారు. దీనిపై సదరు జిల్లా జాయింట్ కలెక్టర్ 25-03-2023న రైతులకు ప్రీ అబాలిషన్ కాలం రికార్డులు, రిజిస్టర్డ్ పత్రాలు, 1958లో సర్వే సెటిల్‌మెంట్ అధికారులు మంజూరు చేసిన రఫ్ పట్టా, పట్టాను ఆమోదిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు, రెవెన్యూ రికార్డులు ఎస్ఎల్ఆర్, ఎఫ్ఎల్ఆర్ లను పున:పరిశీలన చేశారు. 66 సంవత్సరాల క్రితం సదరు భూమికి రైత్వారీ పట్టా మంజూరు చేశారని, ఇందులో తాను చేయాల్సింది ఏమి లేదని జాయింట్ కలెక్టర్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ భూమికి సంబంధించిన రికార్డులు అన్నీ భద్రంగా సర్వే సెటిల్‌మెంట్ ఆఫీసులో ఉన్నాయని సూచించారు. ఇలా పున:విచారణ చేయగా రాగానిపల్లి సర్వే నెంబర్ 22 లోని 982.48 ఎకరాల భూమి ప్రైవేటు భూములుగా తేల్చేశారు.

కూటమి ప్రభుత్వం రాగానే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇప్పుడు ఈ భూములన్నీ అనాధీనంగా మారిపోయాయి. రెవెన్యూ రికార్డులన్నీ తారుమారైపోయి ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా చూపుతున్నాయి. దీన్ని సాక్ష్యంగా తీసుకుని టీడీపీ, అనుకూల పత్రికలు దాన్ని ప్రభుత్వ భూమి అంటూ ప్రచారం చేస్తున్నాయి. దీంతో రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నప్పటికీ, కొన్నేళ్ల నుంచి తమ అనుభవంలో ఉన్నప్పటికీ రైతులకు ఆ భూములు చెందకుండా పోయాయి. ఈ భూములను స్వాధీనం చేసుకోవడానికి ప్రభుత్వం తీవ్రంగా యత్నిస్తుండడం గమనార్హం.

'సీమ'రైతు కడగండ్లకు సాహిత్య గౌరవం ఇచ్చిన 'కేతు'



కేతు తలపులలో స్మృతి సంచికను ఆవిష్కరిస్తున్న అతిథులు

కడప కల్చరల్: రాయలసీమ రైతు కడగండ్లకు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య గౌరవం కల్పించాలని ప్రసిద్ధ కథకులు అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. రాయలసీమ ప్రాతినిధ్య కథకుడు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆదివారం కడపలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం కేతు తలుపులలో పేరిట రూపొందించిన స్మృతి సంచిక ఆవిష్కరణ ఉత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పెనుగొండ లక్ష్మీనారాయణ పుస్తకాన్ని ఇతర రచయితలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి తో తనకు సుదీర్ఘమైన అనుబంధం ఉందన్నారు. కార్మికులు, రైతులు, పేదల పక్షాన సాహిత్య సృజన చేసిన గొప్ప కథకుడు కేతు అని ప్రశంసించారు. మంచి విమర్శకుడిగా ఈ ప్రాంతంలో ఉత్తమ సాహిత్యం రావడానికి ఆయన కృషి చేశారన్నారు. ప్రసిద్ధ కథ నవలా రచయిత ఆచార్య మధురాంతకం నరేంద్ర మాట్లాడుతూ ఆచార్య కేతు స్మృతి సంచికను వెలువరించడంలో యువ రచయిత పాలగిరి విశ్వ ప్రసాద్ చేసిన కృషి మరువలేనిదన్నారు. సభాధ్యక్షులు రచయిత దాదా హయాత్ మాట్లాడుతూ ఆచార్య కేతు రచనల్లో దాపుడు కోక కథను తాను మరిచిపోలేనన్నారు.అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రముఖ రచయిత నాటక కర్త వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ తన రచన యానాన్ని ఆచార్యకేతు ఆత్మీయంగా మార్కిస్ట్ దృక్పథం వైపు మళ్లించాలన్నారు. రచయిత కాట్రగడ్డ దయానంద్, సీపీఐ రాష్ట్ర దర్శివర్గ సభ్యుడు ఓబులేసు, చరిత్ర అధ్యాపకులు వై ప్రభాకర్‌రెడ్డి, ప్రముఖ కథ నవలా రచయిత సన్నపురెడ్డి వెంకట్ రెడ్డి, యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధి కారి ఆచార్య ఎన్ ఈశ్వర్ రెడ్డి, సీనియర్ రచయిత్రి పి సంజీవమ్మ, యువర్ రచయిత దేవేంద్ర చారి కూడా మాట్లాడారు. అనంతరం రచయిత పాలగిరి విశ్వ ప్రసాద్ ఆచార్య కేతు స్మృతి సంచికను తీసుకొచ్చేందుకు ఎదురైన అనుభవాలను సభకు వివరించారు. తొలుత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.



క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మృతి చెందిన వెలుగు రాజ

(ఓబులవారిపల్లె)రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు నియోజకవర్గంలోని చలంపాలెం గ్రామానికి చెందిన వెలుగు రాజ(33) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. వెలుగు రాజ తెల్లవారు జామున చేపలు పట్టేందుకు కొర్లకుంట చెరువులోకి వెళ్లాడు. ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో ఆయన బంధువులు గాలించారు. మట్టి డంపింగ్ సమీపంలో రాళ్లతో శవాన్ని కప్పి ఉంచడ చూశారు. విద్యుదాఘాతంతో రాజా మృతి చెందాడని పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అత్తను చంపిన అల్లుడు అరెస్టు


విజయ్‌కుమార్‌ను అరెస్టు చూపుతున్న సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కే.రహీముల్లా

కేవీపల్లి : మండలంలోని వగ్గ పంచాయతీ నారమాకులపల్లిలో అత్తను చంపిన అల్లుడిని అరెస్టు చేసినట్లు కలకడ సీఐ శ్రీనివాసులు తెలిపారు. నారమాకుపల్లిలో శనివారం భార్యా, భర్తల మధ్య జరిగి తగాదాలో విజయ్ కుమార్ తన అత్త నీలావతిని హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఎస్ఐ కే.రహీముల్లా నిందితుడిని మండలంలోని గర్నిమిట్ట వద్ద ఆదివారం అరెస్టు చేశారు. అతని నుంచి హత్యకు ఉపయోగించిన దొడ్డుకట్టె, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ఎస్టీయూ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్‌గా పిల్లి రామకృష్ణ

పెనగలూరు : ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్‌గా పిల్లి రామకృష్ణ, ఎస్టీయూ రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల కమిటీ కన్వీనర్‌గా పుచ్చకాయల ఎల్లయ్యలను ఎన్నుకున్నట్లు ఎస్టీయూ నాయకులు తెలిపారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తమ వంతుగా పోరాడి పరిష్కరిస్తామని తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

వేంపల్లె : చోరీ కేసులో నిందితులు షేక్ జాఫర్, సయ్యద్ సాధిక్‌లను అరెస్టు చేసినట్లు పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ వివరాలు వెల్లడించారు. వేంపల్లెలో జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ వేంపల్లె పట్టణం బండల ఉత్తన్న వీధిలో నివాసముంటున్న సయ్యద్ నూర్జహాన్ కడపలోని తన కుమార్తె వద్దకు వెళ్లి తిరిగి ఈ నెల 26న ఇంటికి వచ్చి చూడగా గుర్తుతెలియని వ్యక్తులు బీరువా పగలగొట్టి ఆభరణాలు చోరీ చేసినట్లు గుర్తించిందన్నారు. బీరువాలో రూ.4.8 0లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులు దోచుకెళ్లినట్లు ఆరోజే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేంపల్లె పోలీసులు విచారించి ఆదివారం మధ్యాహ్నం పాపాఘ్ని నదిలో వంతెన వద్ద నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, జడ్జి రిమాండ్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన సీఐ చాంద్ బాషా, హెడ్ కానిస్టేబుల్ మధుసూదన వర్మ, కానిస్టేబుళ్లు మహేష్, కిరణ్‌లను డీఎస్పీ అభినందించారు.

చారిత్రక సంపదకు రక్షణ కరవు

శాసనాలు, పురాతన శిల్పాలు, వస్తువులు, చారిత్రక నిర్మాణాలు మన జాతి చరిత్ర, వారసత్వ సంపద గురించి భావితరాలకు వివరిస్తాయి. వాటి కోసం ప్రత్యేక మ్యూజియంలు ఏర్పాటు చేసుకుంటాం. భావితరాలకు తెలియజేలా కడప లోని మహావీర్ మ్యూజియం భవనం నేడో, రేపో కూలేటట్లు ఉంది. చారిత్రక ఆనవాళ్లు లేకుండా పోయే పరిస్థితి ఉన్నా అధికారుల్లో చలనం లేకుండాపోయింది.

- నేడో, రేపో కూలేటట్లున్న మ్యూజియం భవనం
- మరింత శిథిలమవుతున్న శిల్పాలు, శాసనాలు


మహావీర్ మ్యూజియం భవనం


పెచ్చులూడుతున్న భవనం పైకప్పు

కడప కల్చరల్ : కడప నగరంలోని కలెక్టరేట్ ఆవరణలో 1982 జూన్, 8న భగవాన్ మహావీర్ మ్యూజియం పేరిట పురావస్తు సందర్శనశాల ఏర్పాటుచేశారు. స్థానిక జైన సంఘాల సహకారంతో ఏర్పాటు సిన ఈ భవనంలో జిల్లా నలుమూలలా లభించిన అత్యంత విలువైన శిల్పాలు, శాసనాలు, తదితర చారిత్రక వారసత్వ సంపద ఉంచారు. దీనిని ఏర్పాటుచేసి 40 సంవత్సరాలకు పైబడినా ఇంతవరకూ మ్యూజియంలో కాలానుగుణంగా ఆధునీకరించలేదు. దీంతో పెడస్టల్స్ కూలి శిల్పాలు ముక్కలయ్యే ప్రమాదానికి చేరుకుంది. జిల్లాలో మైలవరం, పింఛా, అన్నమయ్య తదితర ప్రాజెక్టుల నిర్మాణ సమయంలో తవ్వకాలలో ఎన్నో శిల్పాలు, వారసత్వ సంపద బయల్పడగా.. చరిత్రకారులు మ్యూజియానికి చేర్చి వాటిని జాగ్రత్తగా ఉంచారు. ఆ సంపదకు నేడు రక్షణ కరువైంది. మ్యూజియం శిథిల స్థితికి చేరింది.

రక్షణ కరువు

జిల్లాలో లభించిన వండాడి శాసనం, జల్లావాండ్లపల్లెలో లభించిన శాసనంతోపాటు మరెన్నో వందలాది శాసనాలు మహావీర్ మ్యూజియంకు చేరాయి. ఇందులో మొత్తం 325కు పైగా రాతి శాసనాలు, శిల్పాలు, మట్టి పాత్రలు, లోహ వస్తువులు, రాజుల కాలం నాటి కత్తులు, ఇతర వస్తువులు ఉన్నాయి. నిజానికి రాష్ట్రంలో ఎక్కువ పురావస్తు సంపద జిల్లాలో ఉన్నట్లు చరిత్రకారులు గతంలో స్పష్టం చేశారు. అంతటి విలువైన వారసత్వ సంపదను కాపాడుకునేందుకు మంచి మ్యూజియం లేకపోవడంతో చరిత్ర ఆనవాళ్లు మాయమవుతున్నాయి. ఆధారాలు కాలగర్భంలోకలిసిపోతూ ఉండడం బాధాకరం. జిల్లాలో జైనం, బౌద్ధం విలసిల్లిన ఆధారాలు కూడా మ్యూజియంలో ఉన్నాయి.

శిథిలమవుతున్నా..

మ్యూజియం భవనం పలుచోట్ల పైకప్పు ఊడి పడుతూ శ్లాబ్ కడ్డీలు కనిపిస్తున్నాయి. మ్యూజియం కార్యాలయం అదే స్థితిలో ఉంది. వర్షం వచ్చినపుడు భవనం మొత్తం ఉరుస్తుండడంతో శిల్పాలను ఉంచిన పెడస్టల్స్ కుళ్లి దెబ్బతింది. సిబ్బందితోపాటు సందర్శకులు భవనం పైకప్పు ఎప్పుడు తమపై పడుతుందేమోనని భయపడుతున్నారు. నిజానికి ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు మ్యూజియం తెరిచినా నెలకు పట్టుమని 30 మంది వస్తున్న దాఖలాలు లేవు. అసలు అక్కడ మ్యూజియం ఉందని కూడా కనిపించదు. కొత్త కలెక్టరేట్‌కు ఎత్తైన ప్రహరీ నిర్మాణంతో మ్యూజియం కనిపించడం లేదు. నూతన భవన నిర్మాణం గురించి ఊసే లేదు. ఇటీవల ఇంటాక్ సంస్థ పాత కలెక్టరేట్ భవనాన్ని మరమ్మతులు చేయించాలని, అందులో జిల్లాస్థాయిలో అధునాతన మ్యూజియం ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించింది. వారి కేంద్ర కార్యాలయాన్ని కూడా సాయం కోరింది.


భవనం బయట విలువైన శిల్ప సంపద


బుద్ధుని పాదాలు

బాధాకరం



జిల్లా చారిత్రక విశేషాలు, సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించేందుకు ఏర్పాటుచేసిన మ్యూజియం శిథిల స్థితికి చేరింది. దీనికి మరమ్మత్తులు చేపట్టకపోవడం బాధాకరం. చరిత్రకారులు ఈ అంశంపై స్పందించాల్సి ఉంది.

– ప్రసాద్, వామపక్ష నాయకుడు, కడప

సంపదకు రక్షణ లేదు



శాసనాలు, శిల్పాలు, విలువైన వారసత్వ సంపద రక్షించుకొనేందుకు జిల్లాలో ఒక్కటైనా అనువైన మ్యూజియం లేకపోవడం బాధాకరం. భావి పౌరులకు జిల్లా చరిత్ర, వారసత్వ సంపదపై అవగాహన కొరవడే ప్రమాదముంది.

– విజయ్‌కుమార్, ఆర్‌టీయూ నాయకులు, కడప

ప్రణాళికలు పంపాం

నూతన మ్యూజియం భవనం కోసం ఉన్నతాధికారులకు ప్రణాళిక పంపాం. అవి అందుబాటులోకి వస్తే కడప మ్యూజియంతోపాటు మైలవరం మ్యూజియానికి నూతన భవనం ఏర్పడుతుంది. నిధుల కోసం ప్రయత్నిస్తూ ఉన్నాం.

– శివకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్, రాష్ట్ర పురావస్తుశాఖ, కడప

అగ్నిప్రమాద ఘటన దురదృష్టకరం

కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



మదనపల్లె : సబ్ కలెక్టరేట్ కార్యాలయంలో రికార్డులు కాల్చడం ఘోరమైన సంఘటనగా కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ వ్యాఖ్యానించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించేందుకు ఆయన మదనపల్లెకు చేరుకున్నారు. పోలీసులు ఆయనను కార్యాలయం లోనికి వెళ్లేందుకు అనుమతించలేదు. దీంతో ఆయన రోడ్డుపై మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వ కార్యాలయంలో రికార్డులు కాల్చివేసిన ఘటనను తాను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది మంచి సంప్రదాయం కాదన్నారు. ఒకప్పుడు అడంగల్, జమాబందీ, రెవెన్యూ బోర్డ్ ఉండేవని, గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను సర్వనాశనం చేసిందన్నారు. దోషులు ఎంత పెద్దవారైనా శిక్షకు అర్హులేనని, సీఐడీ, పోలీస్ అధికారులను అభినందించేందుకు ఇక్కడకు వచ్చానన్నారు. రెవెన్యూ వ్యవస్థను బాగుపరచాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదే అన్నారు. మదనపల్లె ఘటనపై స్పందించిన విధంగానే విజయవాడలో పొల్యూషన్ బోర్డ్ కాలిస్తే చంద్రబాబు సత్వరమే ఎందుకు స్పందించలేదన్నారు. ఐఏఎస్ ఆఫీసర్ అని ఆ ఘటనలో దోషిని విడిచిపెట్టి, చిన్నవారిపై చర్యలు తీసుకుంటారా అని ప్రశ్నించారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

వేంపల్లె : పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పులివెందుల సెబ్ అధికారులు, వేంపల్లె సీఐ చాంద్‌బాషా శనివారం రాత్రి సీజ్ చేశారు. శనివారం అర్ధరాత్రి సెబ్ అధికారులు వేంపల్లె పోలీసులు, ఇసుక స్థావరాలపై దాడులు చేసి అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన ఐదు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. రెండు ట్రాక్టర్ల తాళాలు తీసుకుని డ్రైవర్లు పరారవడంతో వాటికి గాలి తీసి అక్కడే వదిలేశారు. మిగిలిన వాటిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

రాణించిన బ్యాట్స్‌మన్


వరుణ్ సాత్విక్ (158 పరుగులు)


థామస్ రామ్‌కుమార్ (104 పరుగులు)


ధీరజ్ కుమార్ (5 వికెట్లు)


మహబూబ్ అలీ (5 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల మల్టీ డేస్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో కృష్ణా, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కృష్ణా జట్టు 90 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 370 పరుగులు చేసింది. జట్టులోని వరుణ్ సాత్విక్ 140 బంతుల్లో 158 పరుగులు చేశాడు. ఈయనకు జతగా ధనుష్ 48 పరుగులు, గీత్ 84 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. చిత్తూరు బౌలర్ సాయిచరణ్ 4 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

కేఎస్ఆర్ఎం మైదానంలో..

కేఎస్ఆర్ఎం మైదానంలో కడప, శ్రీకాకుళం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు 63.3 ఓవర్లలో 204 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని థామస్ రామ్ కుమార్ 104 పరుగులు చేశాడు. పూర్ణ 32 పరుగులు చేశాడు. కడప బౌలర్లు ధీరజ్‌కుమార్‌రెడ్డి 5 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది. జట్టులోని గురువిఘ్నేష్ 59 పరుగులు, రోహిత్ 39 పరుగులు చేశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విశాఖపట్నం, పశ్చిమ గోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన విశాఖ జట్టు 53 ఓవర్లలో 171 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని కేపీఎస్ ప్రసాద్ 58, యశ్వంత్ 27 పరుగులు చేశారు. పశ్చిమగోదావరి బౌలర్లు మహబూబ్ అలీ 5, హర్షవర్ధన్ 4 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమగోదావరి జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 33 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. జట్టులోని చరణ్ సాయితేజ్ 42 పరుగులు చేశాడు. విశాఖ బౌలర్లు రచిత్ 3, యువన్ 3 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

మొబైల్ దుకాణంలో చోరీ

బద్వేలు అర్బన్ : స్థానిక మైదుకూరు రోడ్డులోని మొబైల్ మార్ట్‌లో చోరీ జరిగింది. శనివారం దుకాణంలోకి ఇద్దరు గుర్తు తెలియని యువకులు వచ్చారు. ఒకరు సెల్‌ఫోన్ పౌచ్ కావాలని అడగడంతో యజమాని పౌచ్‌లు చూపిస్తున్నాడు. ఈ సమయంలో మరో యువకుడు దుకాణంలోని సుమారు రూ.1.10 లక్షలు విలువ చేసే మూడు కొత్త మొబైల్ ఫోన్లు చోరీ చేసి తనతో తెచ్చుకున్న బ్యాగులో వేసుకుని వెళ్లిపోయాడు. అనంతరం యజమాని డిస్‌ప్లేలో ఉంచిన మూడు సెల్ ఫోన్లు కనిపించకపోవడంతో సీసీకెమెరాలను పరిశీలించాడు. యువకుల్లో ఒకరు సెల్ ఫోన్లు చోరీ చేసినట్లు గుర్తించి ఆదివారం అర్బన్ స్టేషన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ యుగంధర్ దుకాణంలోని సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుల ఫొటోలను మీడియాకు విడుదల చేశారు. వారిని చూస్తే 9121100626, 9121100627కు సమాచారం ఇవ్వాలని కోరారు.

పాఠశాలలో చోరీ

వాల్మీకిపురం : మండలంలోని టీకలకోన ఎంపీ పాఠశాలలో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆదివారం పాఠశాల తెరచి ఉండడంతో పాఠశాల ఉపాధ్యాయుడు శివప్రసాద్‌కు స్థానిక వంట మనిషి సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి చూడగా పాఠశాలలో రూ.40 వేల విలువచేసే ఎల్ఈడీ టీవీ చోరీ చేసి, రికార్డులు చిందరవందర చేసినట్లు గుర్తించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీటి ఎద్దడి పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



రాయచోటి : జిల్లాలో తలెత్తుతున్న నీటి ఎద్దడి పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వర్షాభావ పరిస్థితులతో రాబోయే ఆరు మాసాల్లో రాయచోటి నియోజకవర్గంలో తెల్తే నీటి సమస్య దృష్టిలో పెట్టుకుని కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. రాయచోటి నియోజకవర్గంలోని సంబేపల్లె, చిన్నమండెం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లి, రామాపురం మండలాలలో నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు సత్వరమే బోరు బావులు తవ్విస్తున్నట్లు వారు పేర్కొన్నారు. బోర్లు వేయించడం, పైప్ లైన్ మరమ్మతులు చేయడం, నీటి పథకం ఉపయోగంలోకి తేవడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించామన్నారు. ఇందులో భాగంగా ఆదివారం రామాపురం మండలం నల్లగుట్టపల్లి హరిజనవాడ, సంబేపల్లె మండలం దుద్యాల, దిగువ మాదిగపల్లె, చిన్నమండెం మండలం, మల్లూరు గ్రామాల్లో బోర్లను తవ్వించినట్లు పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో





తీవ్రంగా గాయపడిన నరసింహులునాయుడు, గాయపడిన బాలిక సనా, షావలి, హుస్సేన్

నిమ్మనపల్లె : బైక్‌ను ఆటో ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం సాయంత్రం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. మదనపల్లె మండలం బోడుమల్లుదిన్నెకు చెందిన హుస్సేన్ (30), తన భార్య, కుమారుడు షావలి (10), కుమార్తె సనా (8)తో కలిసి చౌడేపల్లె మండలం కోటూరుకు వెళ్లారు. తిరిగి సాయంత్రం స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా.. నిమ్మనపల్లె మండలం బండ్లపై గ్రామం వద్ద ఆటో వేగంగా వచ్చి ఢీకొంది. అంతటితో ఆగక నడచి వస్తున్న ఎనుగొండవారిపల్లెకు చెందిన రైతు నరసింహులునాయుడు (70)ను ఢీకొంది. ప్రమాదంలో హుస్సేన్, షావలి, సనాలతోపాటు రైతు నరసింహులునాయుడు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు బాధితులను 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. నరసింహులునాయుడు పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు రెఫర్ చేశారు. నిమ్మనపల్లె పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కుక్క అడ్డువచ్చి యువకుడికి గాయాలు

కుక్క అడ్డుగా రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. కొత్తవారిపల్లెకు చెందిన భానుప్రసాద్(18) వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వస్తుండగా దుబ్బిగానిపల్లె వద్ద అకస్మాత్తుగా కుక్క రావడంతో అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

ఎర్రచందనం రవాణా కేసులో ప్రధాన నిందితుడు అరెస్టు

బద్వేలు అర్బన్ : బద్వేలు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 23న నమోదైన ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ప్రధాన నిందితుడిని అరెస్టు చేసి అతని నుంచి కారు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ బి.వి.విక్రమసింహ తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పి.పి.కుంట సమీపంలోని గల అటవీప్రాంతం నుంచి ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచారని సమాచారం రావడంతో దాడులు చేసి ఈ నెల 23న అటవీ ప్రాంతంలోని రేగిమానుకుంట వద్ద నెల్లూరు జిల్లా వింజమూరుకు చెందిన స్మగ్లర్ గుద్దేటి రామనాథరెడ్డి, మర్రిపాడు మండలానికి చెందిన ప్రొటెక్షన్ వాచర్లు షేక్‌రసూల్, పాలెంపెంచల ప్రసాద్, ఆవులపోలు చిన్నయ్యలను అరెస్టు చేశారు. 59 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఆ ప్రాంతం నుంచి బద్వేల్ మండలం చెర్లోబోయినపల్లె గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు పిల్లిబోయిన వెంకటరమణ కోసం గాలించారు. కారులో నెల్లూరుకు పారిపోతున్నారని తెలియడంతో సిబ్బందితో వెళ్లి పీపీ.కుంట చెక్ పోస్టు సమీపంలో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడిపై బద్వేల్ అర్బన్, రూరల్, నెల్లూరు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో ఎర్రచందనం కేసులు ఉన్నాయని తెలిపారు. పరారీలో ఉన్న మరింత మంది నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్ఐలు రాజశేఖర్‌రెడ్డి, నరసింహారావు, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మయ్య, కానిస్టేబుళ్ళు మల్లేష్, ఖాజా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పాలకుల మాటలకు.. చేతలకు పొంతన లేదు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.ఎ.గఫూర్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాజకీయ పార్టీల పాలకుల మాటలు.. చేతలకు పొంతన ఉండడంలేదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.ఎ.గఫూర్ పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో సీపీఎం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ బీజేపీ ప్రచారంలో ఈసారి 400 సీట్లు గెలవబోతున్నామని బడాయి మాటలు చెప్పారన్నారు. తొలి, రెండు దశల పోలింగ్ సరళి గమనించాక బీజేపీ వికసిత భారత్ అంటూ కొత్త నినాదం తెరమీదకు తెచ్చిందన్నారు. మిత్రపక్షాలైన బాబు, నితీష్‌లపై ఆధారపడిందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) స్కాం దేశంలోని నీట్, జేఈఈ, మెయిన్స్ రాసే విద్యార్థుల జీవితాలను ప్రశ్నార్థకం చేసిందన్నారు. రాష్ట్రంలో వాలంటీర్లను బలవంతంగా రాజీనామా చేయించారని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

• పెరట్లో పూల సోయగం


ఎర్రమందారం చెట్లు


ఆకట్టుకుంటున్న బర్డ్ ఆఫ్ ప్యారడైజ్


ఆహ్లాదకరంగా నీలిరంగు పుష్పాలు


రోస్‌కలర్ ఎక్జోరాలు


లింకా రోజాలు


ఎరుపురంగులో ఆకర్షణీయంగా..

కారు మబ్బులు కమ్ముకుంటూ చిరు జల్లులు పడే సమయానికి పూల మొగ్గలు పుష్పాలుగా మారి ఇంటి పెరట్లో అహ్లాద వాతావరణాన్ని కలిగిస్తున్నాయి. చిరు జల్లులు పడడంతో తమ గృహాలను అందంగా తీర్చిదిద్దేందుకు పూల మొక్కలు నాటుతున్నారు. దీనికి ఆసరాగా చేసుకుని కొందరు మండలంలోని పలు నర్సరీలు, తమిళనాడు, కర్నాటక, కడియం ప్రాంతాల నుంచి తెప్పించి అమ్మకానికి సిద్ధం చేశారు. రాఘవరాజపురం, అనంతరాజుపేట గ్రామాల్లో ఇంటి పెరట్లో వేసే రోజా, ముద్దమందారం, గన్నేరు, మల్లి వంటి పుష్ప జాతి మొక్కలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

– రైల్వేకోడూరు అర్బన్

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET

■ కడప నగరం పాతబస్టాండు దగ్గర బిగ్‌సి ఎదురుగ గల బిల్డింగ్ బాడుగకు కలదు. 1st ఫ్లోర్ – 1800 sft Upstair (Samsung), 2nd ఫ్లోర్ – 3600 sft, 3rd ఫ్లోర్ – 1600+2000 sft Opem Area. సంప్ర : 9959551113, 9989273876

SERIVCES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్ ట్రేడింగ్ కం. ఫోన్ 73821 14847

WANTED

■ స్థానిక ఒక్క ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు ఉపాధ్యాయులుగా పనిచేయుట కొరకు ఆసక్తిగలవారి నుండి దరఖాస్తులు కోరడమైనది అన్ని సబ్జెక్టులు బోధించుటకు టీచర్లు కావలెను. పార్ట్ టైం మరియు ఫుల్ టైం అభ్యర్థులను కూడా పరిగణలోకి తీసుకోబడును. సంప్ర: 8074717196, 8106123469

■ CBSE SCHOOL RAJAMPET NEEDS Maths ,English, Science, Social for primary, PET, WARDENS FREE FOOD AND ACCO. CALL9100190500

■ మదనపల్లి, CDPలో ఆఫీస్ బాయ్, ప్యాకింగ్ హెల్పర్, వెయిట్ లిఫ్టింగ్, సెక్యూరిటీ గార్డ్స్ జీ: 10000/- 4 Weekoff, ESI, PF, బాలాజీ ఎంటర్‌ప్రైజెస్‌లో కావలెను. సెల్: 8074444019, 9989139239

■ కడపలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 గం॥ , 12 గం॥ డ్యూటీ, ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. 7702336190, 9885698190

■ పాకాల, నేంద్రగుంట, రాజంపేట, సూళ్ళూరుపేట పరిసర ప్రాంతాలలో రెసిడెన్షియల్ ప్లాట్స్‌ని మార్కెటింగ్‌కి ఏజెంట్లు కావలెను.. 9177223100, 8328210044.

■ ఆఫీస్ బాయ్ & ప్యాకింగ్ హెల్పర్ & వెయిట్ లిఫ్టింగ్ & కడప మదనపల్లి బజాజ్ ఎలక్ట్రానిక్ షోరూమ్‌లో కావలెను. ✆ 8179196300, 99891 39239.

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట వారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ : 15000- 40000, ఫ్రీ రూమ్+భోజనం. HYD. Ph : 9014885406

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి 9705907418 9705944423 9010223797 9010072409

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు ...